




కౌంటింగ్ కేంద్రం
బీవీఆర్ఐటీ కళాశాల, గిరిజన గురుకుల విద్యాలయం, నర్సాపూర్

బరిలో నిలిచిన అభ్యర్థులు	44
అసెంబ్లీ సెగ్మెంట్లు	7
మొత్తం ఓటర్లు	18,28,210
పోలైన ఓట్లు	13,72,894
ఏర్పాటు చేసిన మొత్తం టేబుళ్లు	103
మొత్తం కౌంటింగ్ రౌండ్లు	147
ఓట్లు లెక్కించే ఏఆర్వోలు	9
కౌంటింగ్ సూపర్‌వైజర్లు	103
కౌంటింగ్ అసిస్టెంట్లు	110
మైక్రో అబ్జర్వర్లు	117
పోలీస్ సిబ్బంది	650

20 రోజుల ఉత్కంఠకు నేటితో తెరపడనున్నది. మరికొన్ని గంటల్లో లోక్‌సభ ఎన్నికల ఫలితం వెల్లడికానున్నది. మెదక్ లోక్‌సభ నుంచి 44 మంది అభ్యర్థులు, జహీరాబాద్ నుంచి 19 మంది అభ్యర్థులు ఎన్నికల కదనరంగంలో తలపడగా గెలుపు ఎవరిని వరిస్తుందో సాయంత్రం వరకు తేటతెల్లంకానున్నది. జహీరాబాద్‌లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య ముఖాముఖీ పోరు నెలకొనగా ఎవరు బాద్‌షాగా నిలుస్తారో ఆసక్తిని రేకెత్తిస్తుంది. మెదక్‌లో హోరాహోరీగా సాగిన త్రిముఖ పోటీలో ఏ పార్టీ విజయకేతనం ఎగురవేయనున్నదో ఉత్కంఠ నెలకొన్నది. మెదక్ కంచుకోటను బీఆర్ఎస్ మరోసారి నిలుపుకుంటుందా.. లేదా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో ఏదీ గులాబీ కోటను బద్దలుకొడుతుందో రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొన్నది.

ఓట్ల లెక్కింపునకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. మెదక్ లోక్‌సభ కౌంటింగ్ నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల, గిరిజన గురుకుల పాఠశాలలో, జహీరాబాద్ ఓట్ల లెక్కింపును పటాన్‌చెరు పరిధి రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో నిర్వహిస్తున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. 147 రౌండ్లలో మెదక్, 145 రౌండ్లలో జహీరాబాద్ ఫలితం తేలనున్నది.

విజేత ఎవరో?

నేడు తేలనున్న ఫలితం.. 20 రోజుల ఉత్కంఠకు తెర.. ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- మెదక్ లోక్‌సభ కౌంటింగ్ నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ, గిరిజన గురుకుల విద్యాలయంలో..
- జహీరాబాద్ పటాన్‌చెరు గీతం యూనివర్సిటీలో..
- ఉదయం 8 గంటలకు కౌంటింగ్‌ప్రారంభం
- మొదట పోస్టల్ ఓట్ల కౌంటింగ్
- 9.30 తర్వాత తొలిరౌండ్ ఫలితం
- సాయంత్రం వరకు తుది ఫలితం వెల్లడి
- కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి/ మెదక్, జూన్ 3 : గత నెల 13న జరిగిన పోలింగ్‌లో ఓటర్లు తీర్పును ఇవ్వగా, ఈవీఎంలలో నిక్షిప్తమైన ఫలితం నేటి సాయంత్రంతో వెల్లడై పార్లమెంట్ సభ్యుడెవరో తెలియనున్నది. సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్, కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ సెగ్మెంట్లతో కూడిన జహీరాబాద్ పార్లమెంట్ బరిలో 19 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. మెదక్ జిల్లాలోని నర్సాపూర్, మెదక్, సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, సంగారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్లతో కూడిన మెదక్ లోక్‌సభ పరిధిలో 44 మంది అభ్యర్థులు బరిలో నిలిచి తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు.

కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జహీరాబాద్ కౌంటింగ్‌ను పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో, మెదక్ కౌంటింగ్‌ను నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాల, గిరిజన గురుకుల విద్యాలయంలో జరగనున్నది. మెదక్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ బీవీఆర్ఐటీ కళాశాలలో పర్యవేక్షించనుండగా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు గిరిజన గురుకుల కళాశాలలో పర్యవేక్షిస్తారు. జహీరాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి జహీరాబాద్ లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్నది. ఓట్ల లెక్కింపు కోసం సిబ్బందిని ఉదయం 6 గంటల వరకే కౌంటింగ్ కేంద్రాలకు రావాలని ఆదేశించారు. అలాగే కౌంటింగ్ ఏజెంట్లు కూడా 6 గంటల కల్లా చేరుకోనున్నారు. సరిగ్గా 8 గంటలకు లెక్కింపు మొదలు పెట్టేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లను నిషేధించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో కౌంటింగ్ కొనసాగుతుంది.

వివిధ బ్లాకులలో సెగ్మెంట్ల వారీగా ఏర్పాట్లు

జహీరాబాద్ పార్లమెంట్‌లోని ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పోలైన ఓట్ల లెక్కింపునకు గీతంలో ఒక్కో హాల్‌ను ఏర్పాటు చేశారు. ఓట్లు లెక్కించే సిబ్బంది చుట్టూ గ్రిల్స్‌తో బారికేడ్లు ఏర్పాటు చేశారు. గ్రిల్ ఆవల వివిధ రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లు ఉండేలా చర్యలు చేపట్టారు. సిబ్బంది ఈవీఎంలలోని ఓట్లను కౌంటింగ్ ఏజెంట్లకు చూపిస్తూనే లెక్కించనున్నారు. నర్సాపూర్ బీవీఆర్ఐటీ కళాశాలలోని విశ్వేశ్వరయ్య బ్లాకులో మెదక్ సెగ్మెంట్, ఆర్యభట్ట బ్లాకులో సిద్దిపేట, దుబ్బాక, సెగ్మెంట్లు, ఎమ్మిడి నర్సయ్య బ్లాకులో నర్సాపూర్ సెగ్మెంట్, చాణుక్య బ్లాకులో గజ్వేల్ సెగ్మెంట్ ఓట్లను లెక్కించనున్నారు. అదేవిధంగా గిరిజన గురుకుల కళాశాలలో సంగారెడ్డి సెగ్మెంట్, ఒకటో అంతస్థులో పటాన్‌చెరు సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. ఫారం 17ను పరిశీలించాకే పోలైన ఓట్లను పోల్చిచూసి అన్ని టేబుళ్ల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్లను రౌండ్ల వారీగా ప్రకటిస్తారు. ఎన్నికల ఫలితాలను ఎప్పటికప్పుడు తెలియడానికి ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు.

మెదక్ కౌంటింగ్ రెండు చోట్ల

- నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కౌంటింగ్ కేంద్రంలో గజ్వేల్, మెదక్, నర్సాపూర్, దుబ్బాక, సిద్దిపేట అసెంబ్లీ సెగ్మెంట్లు
- నర్సాపూర్‌లోని గిరిజన గురుకుల విద్యాలయంలో సంగారెడ్డి, పటాన్‌చెరు అసెంబ్లీ సెగ్మెంట్ల కౌంటింగ్

మొదట పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు

తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు మొదలైన సమయంలో రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో పోలైన పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు మొదలు కానున్నది. మెదక్ పరిధిలో హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులతో పాటు 85 సంవత్సరాల వయసు పైబడిన వారికి ఇంటివద్దే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడంతో మెదక్ లోక్‌సభ పరిధిలో 1,635 మంది ఓట్లు వేశారు. ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సదుపాయం కల్పించడంతో 14,297 మంది ఓటు వేశారు. 507 మంది సర్వీస్ ఓటర్లు తమ ఓట్లు వేయగా, ఓట్ల లెక్కింపు రోజు ఉదయం 8 గంటల వరకూ వచ్చిన ఓట్లను కూడా లెక్కలోకి తీసుకుని ఆతర్వాత పూర్తి స్థాయిలో లెక్కించనున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో 895 మందికి పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వగా 848 మంది ఓట్లేసి పంపించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. వీటిని తొలుత లెక్కించి ఫలితం వెల్లడించనున్నారు. ఆ తర్వాత ఈవీఎంల లెక్కింపును ప్రారంభిస్తారు.

మెదక్ తొలి ఫలితం దుబ్బాక

మెదక్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఈవీఎం యూనిట్లను తెరిచి ఓట్ల లెక్కింపును చేపడతారు. అన్ని సెగ్మెంట్ల కంటే దుబ్బాకలో తక్కువగా 19 రౌండ్లు ఉన్నాయి. తొలుత దుబ్బాక కౌంటింగ్ పూర్తయి ఫలితం వెల్లడికానున్నది. ఆ తరువాత 20 రౌండ్లు ఉన్న సిద్దిపేట, మెదక్ ఫలితాలు వస్తాయి. అనంతరం 21 రౌండ్లు ఉన్న సంగారెడ్డి, 22 రౌండ్ల చొప్పున ఉన్న గజ్వేల్, నర్సాపూర్ వెల్లడికానున్నాయి. చివరగా 23 రౌండ్లు ఉన్న పటాన్‌చెరు సెగ్మెంట్ కౌంటింగ్ పూర్తవుతుంది.

జహీరాబాద్‌లో తొలి ఫలితాలు...

జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో 19 రౌండ్లలో ఓట్ల లెక్కింపును చేపట్టనున్న జుక్కల్, బాన్సువాడ, కామారెడ్డి సెగ్మెంట్ల తొలి రౌండ్ ఫలితం 9.30 గంటల తర్వాత వెల్లడి కావచ్చని అధికార వర్గాలు భావిస్తున్నాయి. అనంతరం 20 రౌండ్లు ఉన్న ఎల్లారెడ్డి, 22 రౌండ్లు నారాయణఖేడ్ వస్తాయి. తర్వాత 23 రౌండ్ల చొప్పున ఉన్న అందోలు, జహీరాబాద్ సెగ్మెంట్ల ఫలితాలు వెల్లడికానున్నాయి.

భారీ భద్రత మధ్య లెక్కింపు

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. సీఆర్‌పీఎఫ్, సివిల్, ఆర్మ్‌డ్ ఫోర్స్‌తో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అంతేకాకుండా మూడు ప్లాటూన్ల సీఆర్పీఎఫ్ పోలీసు బలగాలను రంగంలోకి దించారు. బీవీఆర్ఐటీ కళాశాల, గిరిజన గురుకుల కళాశాలల వద్ద 650 మందితో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు. గీతం యూనివర్సిటీ వద్ద 750 మంది పోలీసులు విధుల్లో ఉండనున్నారు. కౌంటింగ్ కేంద్రం పరిధిలో 4వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 5వ తేదీ ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉండనుంది. అలాగే మద్యం దుకాణాలన్నింటినీ మూసివేయనున్నారు.



కౌంటింగ్ కేంద్రం
గీతం యూనివర్సిటీ, రుద్రారం, పటాన్‌చెరు

బరిలో నిలిచిన అభ్యర్థులు	19
అసెంబ్లీ సెగ్మెంట్లు	7
మొత్తం ఓటర్లు	16,41,410
పోలైన ఓట్లు	12,25,049
ఏర్పాటు చేసిన మొత్తం టేబుళ్లు	98
మొత్తం కౌంటింగ్ రౌండ్లు	145
ఓట్లు లెక్కించే ఏఆర్వోలు	7
కౌంటింగ్ సూపర్‌వైజర్లు	98
కౌంటింగ్ అసిస్టెంట్లు	98
మైక్రో అబ్జర్వర్లు	98
పోలీస్ సిబ్బంది	750



కంచుకోట పదిలమేనా!

రసవత్తరంగా మెదక్ సీటు

మెదక్ సీటుపైనే బీఆర్ఎస్ ఆశలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 3 : మరికాసేపట్లో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయి. తమ పార్టీకి కంచుకోటగా నిలుస్తున్న మెదక్‌లో మళ్లీ తామే పాగా వేస్తామంటూ బీఆర్ఎస్ కోటి ఆశలు పెట్టుకుంది. ఈ ప్రాంతంలోని ఉద్యమ నేపథ్యంతోపాటు అభివృద్ధి, దీనికితోడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సర్వశక్తులు ఒడ్డారు. అంతేగాకుండా బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి పార్టీ బలంతోపాటు తన సొంత హామీలు కూడా కలిసివస్తాయనే అంచనాలు ఉన్నాయి. వీటన్నింటితో పాటు తాజా ఎగ్జిట్‌పోల్ ఫలితాల్లోనూ మెదక్‌లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని మెజార్టీ ఏజన్సీలు చెప్పకనే చెప్పాయి. కొన్ని ఏజన్సీలు మాత్రం ఇక్కడ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు విజయం సాధిస్తారని ప్రకటించాయి. గత పార్లమెంటు ఎన్నికలతో పాటు గడిచిన దుబ్బాక అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన రఘునందన్‌కు అనుకూల వాతావరణం కనిపించిందని, మోదీ చరిష్మా కలిసివచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇక కాంగ్రెస్ పార్టీ కూడా సైలెంట్ ఓటింగ్‌పై నమ్మకం పెట్టుకుంది. తమ అభ్యర్థి నీలం మధు బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడమే తమకు ప్లస్ పాయింట్ అని చెబుతున్నారు. చాపకింద నీరులా మహిళల ఓట్లన్నీ కాంగ్రెస్ పడ్డాయనే ధీమాలో ఉన్నారు.

ఎవరు గెలిచినా రికార్డే..

మెదక్ సెగ్మెంటులో ప్రస్తుతం ఏ పార్టీ అభ్యర్థి గెలిచినా కొత్త రికార్డు నమోదవుతుంది. 2004, 2009, 2014, 2014 ఉప ఎన్నిక, 2019 ఎన్నికల్లో వరుసగా ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే గెలుపొందారు. 20 ఏళ్లుగా ఆ పార్టీకి ఈ సీటు కంచుకోటగా మారింది. ఇప్పుడు గెలిస్తే వరుసగా ఆరుసార్లు గెలిచిన రికార్డు బీఆర్ఎస్ సొంతమవుతుంది. అంతేగాకుండా 25ఏళ్ల పాటు ఆ పార్టీ అభ్యర్థులే ఎంపీలుగా ఉన్న రికార్డు కూడా దక్కుతుంది. ఇక మెదక్ స్థానానికి 18 సార్లు ఎన్నికలు జరిగితే 9 దఫాలుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. ఆ పార్టీ ఇప్పుడు విజయం సాధిస్తే 10 సార్లు గెలిచిన రికార్డుతో పాటు బీఆర్ఎస్ కంచుకోటను బద్దలుకొట్టిన ఘనత సైతం సొంతమవుతుంది. అదే విధంగా 1999లో ఇక్కడి నుండి ఆలె నరేంద్ర బీజేపీ తరపున బరిలోకి దిగి ఎంపీగా గెలిచారు. అంతకుముందు, ఆ తర్వాత బీజేపీ ఇక్కడ కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోయింది. ఇప్పుడు మళ్లీ గెలిస్తే బీఆర్ఎస్ రికార్డులను బ్రేక్ చేయడంతో పాటు ఇందిరా నియోజకవర్గంగా పేరున్న ఇక్కడ బీజేపీ పాగా వేసిందనే ఘనతను దక్కించుకున్నట్లవుతుంది. అందుకే మూడు పార్టీలు మెదక్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.

బీఆర్ఎస్ పార్టీకి కీలకం..

జాతీయ రాజకీయాల్లో అడుగుపెట్టడానికి టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చడంతో అప్పట్లో కేసీఆర్ పేరు దేశమంతటా చర్చకు దారితీసింది. పలు రాష్ట్రాల్లో పార్టీ విస్తరణకు ప్రయత్నాలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థులను ఆయా ఎన్నికల్లో బరిలో దింపారు. అయితే, గత అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం సొంత రాష్ట్రంలోనే బీఆర్ఎస్‌కు ఓటమి తప్పలేదు. దీంతో ఇతర రాష్ట్రాల్లో ఆ పార్టీకి, కేసీఆర్‌పై విశ్వాసం సన్నగిల్లింది. పార్లమెంటు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేయడానికి సైతం వెనుకంజ వేసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ఎన్నికల్లో ఆ పార్టీకి అనుకూల పరిస్థితులు వస్తేనే భవితవ్యం ఉంటుందని, లేకపోతే మరింత లోతున పడకతప్పదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక్కడ గెలవకుంటే బీఆర్ఎస్ ఇంకెక్కడా గెలిచే పరిస్థితి లేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అందుకే మెదక్ సీటే బీఆర్ఎస్ భవితవ్యాన్ని నిర్ణయించనున్నది. దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిన బీఆర్ఎస్ పార్టీ పరిస్థితిపై ఆరా తీయడం మొదలుపెట్టారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో మెదక్ సీటు హాట్‌టాపిక్‌గా మారింది.

జహీరాబాద్‌లో ముఖాముఖీ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 3 : 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్న జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో పోలింగ్ నాటికి కాంగ్రెస్, బీజేపీల మధ్య ముఖాముఖీ పోరు సాగింది. ఈ పోరులో కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్, బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌లలో గెలిచేది ఎవరోనని ఉత్కంఠగా మారింది. ముఖాముఖీ పోరులో బీబీ పాటిల్ గెలిచి హ్యాట్రిక్ కొడతారో? 2014లో తనను ఓడించిన బీబీపాటిల్‌ను ఈసారి ఓడించి సురేష్‌షెట్కార్ ప్రతీకారం తీర్చుకుంటారో? నేటి సాయంత్రం వరకు నిరీక్షించాల్సిందే!

మెదక్‌లో 147.. జహీరాబాద్‌లో 145 రౌండ్లు

ఓట్ల లెక్కింపు కోసం మెదక్ లోక్‌సభ నియోజకవర్గం మొత్తం 103 టేబుళ్లను ఏర్పాటు చేయగా, జిల్లా ఎన్నికల యంత్రాంగం 147 రౌండ్లలో లెక్కింపు పూర్తయ్యేలా చర్యలు చేపట్టింది. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సిద్దిపేట, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, దుబ్బాకలో 14 చొప్పున, గజ్వేల్‌లో 15, పటాన్‌చెరులో 18 టేబుళ్లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌కు మొత్తం 461 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. జహీరాబాద్ ఓట్ల లెక్కింపునకు మొత్తం 98 టేబుళ్లను ఏర్పాటు చేసిన జిల్లా ఎన్నికల యంత్రాంగం 145 రౌండ్లలో లెక్కింపు పూర్తయ్యేలా చర్యలు చేపట్టింది. నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీలకు ఓట్ల లెక్కింపునకు ఒక్కో సెగ్మెంట్ 14 టేబుళ్ల జరుపనున్నారు. మొత్తం 326 మంది సిబ్బంది ఓట్ల లెక్కింపునకు వినియోగిస్తున్నారు. కౌంటింగ్ జరిపే ఒక్కో టేబుల్ వద్ద ఒక్కో సూపర్‌వైజర్, ఒక్కో సహాయకుడు, ఒక్కో మైక్రో అబ్జర్వర్ ఉండనున్నారు. అన్ని సెగ్మెంట్ల ఈవీఎంల ఫలితాలు పూర్తయ్యాక ర్యాండమైజేషన్‌లో ఒక్కో సెగ్మెంట్‌లో కొన్ని పోలింగ్ బూత్‌ల వారీగా వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కిస్తారు. ఈవీఎంలతో సరిపోల్చిన తర్వాత ఫలితాన్ని ప్రకటిస్తారు.

ఏ చిన్న పొరపాటు కూడా జరగొద్దు : కలెక్టర్



నర్సాపూర్‌లో ఓ కౌంటింగ్ కేంద్రంలో అధికారులకు సూచనలు చేస్తున్న మెదక్ కలెక్టర్, ఆర్వో రాహుల్‌రాజ్

నర్సాపూర్, జూన్ 3: మెదక్ పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌లో ఏ చిన్నపొరపాటు కూడా జరగొద్దని మెదక్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్ సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన నర్సాపూర్‌లోని కౌంటింగ్ కేంద్రాలైన బీవీఆర్ఐటీ, గిరిజన గురుకులంలో ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కౌంటింగ్‌లో పాల్గొనే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్నపొరపాటు చేయకూడదని చెప్పారు. ఈ కౌంటింగ్‌కు ప్రత్యేకంగా కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి ముగ్గురు పరిశీలకులు హాజరుకానున్నారు. మెదక్, నర్సాపూర్ సెగ్మెంట్లకు ఒకరు, పటాన్‌చెరు, సంగారెడ్డి సెగ్మెంట్లకు ఒకరు, అలాగే సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాకకు ఒక పరిశీలకుడు చొప్పున నియమించారు.







జహీరాబాద్ కౌంటింగ్ కేంద్రం గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన టేబుళ్లు, అధికారులకు సూచనలు చేస్తున్న సంగారెడ్డి కలెక్టర్, ఆర్వో క్రాంతి, నర్సాపూర్‌లోని మెదక్ లోక్‌సభ కౌంటింగ్ కేంద్రమైన బీవీఆర్ఐటీలో ఏర్పాటు చేసిన టేబుళ్లు

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

కల్హేర్, జూన్ 3: మండల పరిధిలోని మాసాన్‌పల్లి గ్రామంలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మాసాన్‌పల్లికే చెందిన సాయికిరణ్‌రెడ్డి, మహేందర్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్ పోటీలో సాయికిరణ్ జట్టు మహేందర్ జట్టుపై విజయం సాధించి కప్పు కైవసం చేసుకున్నారు. విన్నర్, రన్నరప్ జట్లకు కల్హేర్ ఎస్ఐ వెంకటేశం బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజుగౌడ్, శివాజీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

విత్తనాలు అందించడంలో విఫలం

● బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 3: రైతులకు విత్తనాలు అందించడంలో సర్కారు విఫలమైందని బీజేపీ కిసాన్‌మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్‌రెడ్డి విమర్శించారు. విత్తనాల విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫసల్ బీమా యోజనను తెలంగాణలో అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, జిల్లా నాయకులు మాణిక్‌రెడ్డి, పట్టణ కిసాన్‌మోర్చా అధ్యక్షుడు లింగమూర్తి, జిల్లా కార్యాలయ కార్యదర్శి దోమల విజయకుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు నాగరాజు తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి

మెదక్ అర్బన్: రైతుల సమస్యలను పరిష్కరించి, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతుల సమస్యలను కలెక్టర్ దృష్టి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానకాలం సీజన్ ప్రారంభమవుతుండున్న రైతులకు కావాల్సిన విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. పంట నష్టం జరగకుండా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేయాలని కోరారు. లేదంటే ఆందోళనలకు దిగుతామని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు.



సంగారెడ్డిలో మాట్లాడుతున్న కిసాన్‌మోర్చా నాయకులు

22మంది విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

చిలప్‌చెడ్, మే 3: ఇంటర్‌నేషనల్ సైక్లిండేను పురస్కరించుకుని సోమవారం మెదక్ జిల్లా ఫైజాబాద్ ఉన్నత పాఠశాలలో 22మంది విద్యార్థినులకు హైదరాబాద్‌కు చెందిన హైదరాబాద్ సైకిల్ గ్రూపు ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లను చేశారు. పాఠశాలకు కాలినడకన వస్తున్న అజ్జమర్రికి చెందిన 20 మంది, ఫైజాబాద్‌కు చెందిన ఇద్దరి విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. రవాణా ఖర్చులను అజ్జమర్రి మాజీ సర్పంచ్ పరశురాంరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌సిజి గ్రూపు సభ్యులు సుభాష్, రవీందర్, పాఠశాల హెచ్‌ఎం తారాసింగ్ పాల్గొన్నారు.



ఫైజాబాద్ పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లను అందజేస్తున్న దృశ్యం

గాలివాన బీభత్సం

● నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
● ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు

కంగ్టి/కొల్చారం, జూన్ 3: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని చాప్టా.కెలో ఆదివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పలు గ్రామాల్లో తేలిక పాటి వర్షం కురిసినప్పటికీ చాప్టా.కె గ్రామంలో వర్షానికి తోడు తీవ్రమైన గాలులు వీచాయి. దీంతో దాదాపు పది ఇళ్ల రేకులు ఎగిరిపోయాయి. ఇండ్ల పైఉన్న రేకులు ఎగిరిపడడంతో అలేఖ్య అనే పదకొండేళ్ల చిన్నారికి, జగదేవి అనే మహిళకు గాయాలయ్యాయి. రెండు కరెంట్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ తీగలు తెగి కరెంట్ సరఫరా నిలిచి పోయింది. భారీ చెట్లు సైతం నేలకొరిగాయి. నష్టం జరిగిన ఇళ్లకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం కోనాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన వరిధాన్యంతో పాటు బస్తాలు తడిసి ముద్దయ్యాయి. ఆలస్యంగా వచ్చిన వరికోతలకు తోడు, సకాలంలో లారీలు రాకపోవడం, తూకం వేసిన వరిధాన్యం బస్తాల తరలింపులో జాప్యంతోనే ధాన్యం తడిసి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోనాపూర్‌లో తడిసిన ధాన్యాన్ని జిల్లా పౌరసరాల అధికారి బ్రహ్మారావు ఆదివారం పరిశీలించారు. తడిసిపోయిన వరిధాన్యం బస్తాలను తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మరో రెండు, మూడు రోజుల పాటు కేంద్రం కొనసాగింపునకు చర్యలు తీసుకోవాలని సొసైటీ వైస్ చైర్మన్ మోత్కు మల్లేశం, రైతులు కోరారు. తడిసిపోయిన వరిధాన్యం బస్తాల వివరాలను రంగంపేట సొసైటీ సీఈవో నవీన్ నమోదు చేసుకున్నారు.



వర్షాలు కురుస్తుండడంతో రైతులు విత్తనాల కొనుగోలులో నిమగ్నమయ్యారు. ఖేడ్‌లోని దుకాణం వద్ద రైతులు ఇలా విత్తనాలు కొనుగోలు చేస్తూ కనిపించారు. - నారాయణఖేడ్



కంగ్టి మండలం చాప్టా.కెలో గాలికి ఎగిరిపోయి చెట్టుపై ఇరుక్కు పోయిన రేకు



కంగ్టి మండలం చాప్టా.కెలో నేలకొరిగిన చెట్టు



కొల్చారం: కోనాపూర్‌లో తడిసిముద్దయిన వరిధాన్యం బస్తాలు

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా

హైవే పనులు పూర్తి చేయాలి

● రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



రోడ్డు విస్తరణ బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జూన్ 3: వర్షాకాలం దృష్ట్యా హుస్నాబాద్ పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాతీయ రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం హుస్నాబాద్ పట్టణంలో జరుగుతున్న నేషనల్ హైవే పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు విస్తరణలో నష్టపోతున్న బాధితులతో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా రోడ్డు పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా పనులు జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. రోడ్డు నిర్మాణం జరిగితే ఇళ్లల్లోకి వరద నీరు రాకుండా ఉంటుందన్నారు. ఆయనవెంట మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, జేఏసీ కో ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కోమటి సత్యనారయణ ఉన్నారు.

కేంద్రంలో అధికారం కాంగ్రెస్‌దే

● మంత్రి దామోదర్ రాజనర్సింహ

జహీరాబాద్, జూన్ 3: దేశంలో ప్రజలు మార్పును కోరుకుంటున్న నేపథ్యంలో కేంద్రంలో తామే అధికారంలోకి వస్తామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో ప్రజలు మార్పును కోరి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చిన తరహాలోనే కేంద్రంలో కూడా మార్పు జరగనుందన్నారు. నేడు వెలువడనున్న ఫలితాలు ఇండియా కూటమికి అనుకూలంగా ఉంటాయని ధీమా వ్యక్తం చేశారు.

సిద్దిపేట జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా మహేష్



సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 3: ఏడు రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'వ్యవసాయ శాఖలో గందరగోళం' కథనానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం స్పందించింది. హుస్నాబాద్ ఏడీఏగా విధులు నిర్వర్తిస్తున్న పి.మహేష్‌కు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు కలెక్టర్ మను చౌదరిని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

ధాన్యం కుప్పను ఢీకొని గాయపడిన వ్యక్తి మృతి

మనోహరాబాద్, జూన్ 3: రోడ్డుపై ధాన్యం కుప్పను ఢీకొని గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్‌కు చెందిన పత్తిరి యాదగిరి(40) గత నెల 27న రాత్రి 8 గంటలకు పని నిమిత్తం మనోహరాబాద్ నుంచి గజ్వేల్‌కు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. రంగాయపల్లి శివారులోని అగ్రహారం వెళ్లే దారిలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. గత నెల 28న మృతుడి కూతురు పత్తిరి అఖిల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రశాంతంగా పది సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభం

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్, జూన్ 3: పదోతరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణ కోసం మెదక్ జిల్లాలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో తొలిరోజు 226 మంది విద్యార్థులకు గానూ.. 185 మంది (81.86శాతం) హాజరు కాగా 41 మంది గైర్హాజరైనట్లు డీఈవో రాధికిషన్ తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్, రామచంద్రాపురంలోని జడ్పీ హైస్కూల్, జహీరాబాద్‌లోని సిద్దార్థ హైస్కూల్ కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 249 మందికి 208 మంది హాజరుకాగా, 41 మంది గైర్హాజరయ్యారు. 83.53 శాతం హాజరు నమోదైందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా రామచంద్రాపురం జడ్పీహైస్కూల్ కేంద్రాన్ని డీఈవో వెంకటేశ్వరు పరిశీలించారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి: ఎస్పీ

మెదక్ అర్బన్, జూన్ 3: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ బాలస్వామి పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు అర్జీలు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలిపిన మోయిద్‌ఖాన్



నారాయణఖేడ్, జూన్ 3: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ సెల్ నేత మోయిద్‌ఖాన్ సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మోయిద్‌ఖాన్

త్వరలో టీచర్ల బదిలీలు, ప్రమోషన్లు!

● ఎన్నికల కోడ్ అనంతరం ప్రక్రియ చేపట్టే అవకాశం
● ఈ నెల రెండో వారంలో షెడ్యుల్ విడుదలకు ఛాన్స్

సంగారెడ్డి అర్బన్, జూన్ 3: ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. వివిధ కారణాలతో గతేడాది బదిలీలు, ప్రమోషన్లకు బ్రేక్ పడిన విషయం తెలిసిందే. గతేడాది విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం గెజిటెడ్ హెచ్ఎంల పదోన్నతులు విజయవంతంగా పూర్తయ్యాయి. అయితే ప్రమోషన్లకు టెట్ అవసరమని, అందుకు ఎన్‌సీటీఈ నిబంధనలున్నాయంటూ కొందరు టీచర్లు హైకోర్టును ఆశ్రయించడంతో గతేడాది అక్టోబరులో బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా టెట్ అర్హతతో సంబంధం లేకుండానే ప్రమోషన్లు ఇవ్వొచ్చని ఇటీవల హైకోర్టు ఉత్వర్వులు జారీ చేసింది. దీంతో పదోన్నతులకు మార్గం సుగమమైంది. కాగా ఎన్నికల కోడ్ ముగియగానే ప్రభుత్వ అనుమతితో ఈ నెల రెండో వారంలో బదిలీలు, ప్రమోషన్లను చేపట్టాలని విద్యాశాఖ భావిస్తున్నది.

గతేడాది జరిగిన బదిలీలు, పదోన్నతులు

సంగారెడ్డి జిల్లాలో గతేడాది జరిగిన గెజిటెట్ హెచ్ఎంల బదిలీల్లో ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ఆరుగురు, జడ్పీ హైస్కూల్(లోకల్‌బాడీ)పరిధిలో 86మంది మొత్తం 92 మంది జీహెచ్ఎంలు బదిలీ కాబడ్డారు. ఇతర జిల్లాల నుంచి సంగారెడ్డి జిల్లాకు 11 మంది జీహెచ్ఎంలు బదిలీపై వచ్చారు. జీహెచ్ఎంల బదిలీ తర్వాత ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ఎనిమిది, జడ్పీ యాజమాన్య పరిధిలో 61మంది మొత్తం 69 జీహెచ్ఎం పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఆ తర్వాత ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 13 మంది స్కూల్ అసిస్టెంట్లు జీహెచ్ఎం(గ్రేడ్-2)గా పదోన్నతి పొందగా, ఇతర జిల్లాల నుంచి సంగారెడ్డికి ఐదుగురు జీహెచ్ఎంలు పదోన్నతిపై వచ్చారు. ఈ జిల్లా నుంచి 80 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. ఇలా ఉండగా జిల్లాలో 5,947 టీచర్ పోస్టులు మంజూరు కాగా 5,079 మంది ప్రస్తుతం పనిచేస్తురు. 868 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నెలలోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపడుతామన్న సంకేతాల నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అప్రమత్తమైంది. ఈ మేరకు సీనియారిటీ జాబితా సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు ఆ వర్గాలు తెలిపాయి.



సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయం

జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు

● వేర్వేరు చోట్ల నిందితుల అరెస్టు
● వివరాలు వెల్లడించిన సిద్దిపేట ఏసీపీ మధు

సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు, జూన్ 3: జల్సాలకు అలవాటుపడి దొంగతనాల బాటపట్టిన ఇద్దరి నిందితులను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సిద్దిపేట ఏసీపీ కార్యాలయంలో కేసుల వివరాలను సిద్దిపేట ఏసీపీ జి.మధు వెల్లడించారు. సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏప్రిల్ నెలలో ఇర్కోడు గ్రామ శివారులోని మల్లన్న గుడిలో దుండగులు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి తన సిబ్బందితో కలిసి ఇర్కోడు శివారులో సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా చిట్యాల రాజిరెడ్డి పోలీసులను చూసి ఆటోలో పారిపోవడానికి ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. విచారించగా గుడిలో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. జల్సాలకు అలవాటు పడిన రాజిరెడ్డి రాత్రి వేళల్లో నిర్మానుష్యంగా ఉండే గ్రామ శివారులోని ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు ఏసీపీ తెలిపారు. సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తోర్నాల, ఇర్కోడు, మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం, లక్ష్మీనగర్, కాసులాబాద్, చిన్నకోడూరు, రాంసాగర్, అనాజీపేట్ గ్రామాల్లోని ఆలయాల్లో చోరీలకు పాల్పడినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడి నుంచి 13.5 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ మధు చెప్పారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ అపూర్వరెడ్డిని, సిబ్బందిని ఏసీపీ అభినందించారు. సమావేశంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

రామునిపట్లలో చైన్ స్నాచర్ అరెస్టు

జల్సాలకు డబ్బుల కోసం వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితుడిని చిన్నకోడూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఏసీపీ జి.మధు తెలిపారు. చిన్నకోడూరు మండలంలోని రామునిపట్ల శివారులో సోమవారం ఉదయం చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుమ్మం రాకేశ్ బైక్‌పై సిద్దిపేట వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్నాడు. పోలీసులను చూసి భయాందోళనకు గురవుతండగా అతడిని ఆపి తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు లభించాయి. వాటి వివరాలు అడగగా తడబడుతూ సమాధానం చెప్పాడు. అనుమానం వచ్చి విచారణ చేయగా జల్సాల కోసం పలు చోట్ల చైన్ స్నాచింగ్‌లు చేశానని నిందితుడు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి 5.9 గ్రాముల బంగారు ఆభరణాలు, చైన్ స్నాచింగ్‌కు ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ బాలకృష్ణను, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.




వివరాలు వెల్లడిస్తున్న సిద్దిపేట ఏసీపీ మధు

ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రత

● సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు లేవు
● నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు
● సంగారెడ్డి, మెదక్ జిల్లాల ఎస్పీలు రూపేష్, బాలస్వామి
● గీతం వద్ద 750 మందితో మూడంచెల బందోబస్తు

సంగారెడ్డి క్రైం, జూన్ 3: పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రతను పోలీసులు ఏర్పాటు చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో జహీరాబాద్ లోక్‌సభ ఓట్ల లెక్కింపును మంగళవారం చేపట్టనున్నారు. లెక్కింపు కేంద్రం వద్ద జిల్లా పోలీసులు, కేంద్ర బలగాలు కలిసి మొత్తం 750 మందితో మూడంచెల విధానంతో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. లెక్కింపు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి ఏర్పాట్లను, భద్రతా పరమైన అంశాలను పరిశీలించారు. కౌంటింగ్ సెంటర్ పరిసర ప్రాంతాలతో పాటు జిల్లా వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం 6గంటల నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. మద్యం దుకాణాలను మూసివేయించినట్లు తెలిపారు. బందోబస్తుకు వచ్చిన పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్దకు వచ్చే వారికి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, పార్కింగ్ ఏరియాలలో వాహనాలను పార్కింగ్ చేసే విధంగా చూడాలన్నారు. మొబైల్ ఫోన్లు, అగ్గిపెట్టెలు, బాణాసంచాలు, లైటర్ల వంటి నిషేధిత పేలుడు పదార్థాలు కౌంటింగ్ కేంద్రాల వద్దకు తీసుకొని రాకుండా చూడాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల లోపల, బయట పరిసరాలు అన్ని సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయని వెల్లడించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అన్ని రకాల భద్రతాపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సంఘ విద్రోహ శక్తులెవరైనా కౌంటింగ్ ప్రక్రియకు ఆటంకం కలిగించాలని చూసినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో వుటుందని, నలుగురి కంటే ఎక్కువ మంది కానీ గుంపులు గుంపులుగా తిరగరాదన్నారు. పార్టీ జెండాలు, పార్టీ కండువాలు ధరించరాదని, పార్టీ గుర్తులు, ప్లకార్డులు ప్రదర్శించరాదని, మైకులు, లౌడ్‌స్పీకర్లు, ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు జిల్లా ప్రజలు ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఎంపీ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని, రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డులను కలిగి ఉన్న వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ వివరించారు.



సీసీ కెమెరాల నిఘాలో గీతం యూనివర్సిటీలోని కౌంటింగ్ కేంద్రం

నర్సాపూర్ బీవీఆర్‌ఐటీ కళాశాల వద్ద 423 మందితో..

మెదక్ అర్బన్: మెదక్ లోక్‌సభ ఓట్ల లెక్కింపును నర్సాపూర్‌లోని బీవీఆర్ ఐటీ కళాశాల, అల్లూరి సీతారామరాజు(ట్రైబల్ వెల్ఫేర్) పాఠశాలల్లో చేపట్టనున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 423 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామని మెదక్ ఎస్పీ బాలస్వామి తెలిపారు. డీఎస్పీలు ఏడుగురు, సీఐలు 14, ఎస్ఐలు 42, ఏఎస్ఐ,హెడ్ కానిస్టేబుల్ 80, మహిళ పోలీసులు, హోంగార్డులు 61 మంది, 3 ప్లాటూన్‌ల టీజీఎస్‌పీ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జిల్లా పరిధిలో ఏ చిన్నపాటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బలగాలతో కట్టుదిట్టమైన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదన్నారు. నిబంధలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. కౌంటింగ్‌కు హాజరై ఏజెంట్లు, అధికారులకు సెల్‌ఫోన్లు, నిషేధిత వస్తువులు కేంద్రంలోకి తీసుకురావద్దని సూచించారు. ఎలక్షన్ కమిషన్ ద్వారా జారీ చేసిన గుర్తింపు కార్డులు ఉంటేనే లోనికి అనుమతి ఉంటుందన్నారు. అధికారులు, ఏజెంట్లు, మీడియాకు ప్రవేశాలు, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఆ స్థలంలోనే పార్కింగ్ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని మెదక్ ఎస్పీ బాలస్వామి వెల్లడించారు.



ఎస్పీలు రూపేష్, బాలస్వామి

రైతుల వివరాల పట్టికను పకడ్బందీగా నమోదు చేయాలి: ఏడీఏ

మునిపల్లి, జూన్ 3: విత్తన, ఎరువులు కొనుగోలు చేసిన రైతుల వివరాల పట్టికను పకడ్బందీగా నమోదు చేయాలని రాయికోడ్ డివిజన్ వ్యవసాయసంచాలకుడు(ఏడీఏ) సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బుదేరా చౌరస్తాలో పలు ఫర్టిలైజర్, విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేసి డీలర్ల లైసెన్సులు, విత్తన నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసే ఎరువులు, విత్తనాలకు సంబంధించి డీలర్లు తప్పని సరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. అలాగే విత్తన, ఎరువులను అధికధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏఈవో స్నేహ, డీలర్లు ఉన్నారు.

పాలిసెట్‌లో మెరిసిన మెదక్ జిల్లా


శశి వరుణ్, సాహితి

మెదక్ అర్బన్, జూన్ 3: మెదక్ జిల్లా విద్యార్థులు సోమవారం విడుదలైన పాలిసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఎంపీసీ విభాగంలో మెదక్‌కు చెందిన శశివరుణ్ 128వ ర్యాంక్, బైపీసీలో 84వ ర్యాంకు, దేవులపల్లికి చెందిన సాహితి 287వ ర్యాంకు, బైపీసీలో 168వ ర్యాంకు సాధించారు. ఎంపీసీలో యూసుఫ్‌పేటకు చెందిన దేవిస్‌రెడ్డి 299వ ర్యాంకు సాధించారు.

సంగారెడ్డి విద్యార్థుల ప్రతిభ

సంగారెడ్డి అర్బన్, జూన్ 3: పాలిసెట్ - 2024 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గత నెల 23న పాలిసెట్ ప్రవేశపరీక్ష జరిగిన విషయం తెలిసిందే. సంగారెడ్డి పట్టణంలోని ఏడు కేంద్రాల్లో 2,200 మంది, జహీరాబాద్‌లోని 3 కేంద్రాల్లో 708 మంది పరీక్ష రాశారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో సంగారెడ్డి జిల్లాలో ఎంపీసీ విభాగంలో వడ్ల అనూష, హరిచంద్రవాహిని, కుమ్మరి ప్రణీత్ జిల్లాస్థాయి ర్యాంకులు సాధించారు. ఎంబైపీసీ విభాగంలో హరిచంద్ర, గాండ్ల నవ్యయోగ్యశ్రీ, మహేశ్వరి జిల్లాస్థాయి ర్యాంకులు సాధించినట్టు కో ఆర్డినేటర్ శ్రీనివాసులు తెలిపారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

నాగల్‌గిద్ద, జూన్ 3: నాగల్‌గిద్ద మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరుగాల్సి ఉండగా, సకాలంలో సభ్యులు హాజరు కాకపోవడంతో పాటు, కోరం లేక సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్ తెలిపారు. సభను మళ్లీ ఎప్పుడు నిర్వహించాలని అంశంపై తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

బీరప్ప కరుణతో సమృద్ధిగా వర్షాలు

కొల్చారం, జూన్ 3: బీరప్పస్వామి కరుణతోనే సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోనాపూర్‌లో జరిగిన బీరప్ప జాతరకు సోమవారం టీపీసీసీ రాష్ట్ర నాయకులు సోమన్నగారి రవీందర్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు సుహాసినిరెడ్డిలతో కలిసి హాజరయ్యారు. జాతరలో కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేశంగౌడ్, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, బండి రమేష్, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మురుగు కాలువలను శుభ్రం చేయాలి

నారాయణఖేడ్, జూన్ 3: వానాకాలం ప్రారంభం కానుండడంతో నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ సూచించారు. సోమవారం ఉదయం శానిటేషన్ పనులను పరిశీలించి శానిటేషన్ అధికారి శ్రీనివాస్‌కు పలు సూచనలు చేశారు.

అట్టహాసంగా దత్తాత్రేయ ఉత్సవాలు

నారాయణఖేడ్, జూన్ 3: ఖేడ్‌లోని దత్తాత్రేయ ఆశ్రమంలో సోమవారం నుంచి దత్తాత్రేయ ఉత్సవాలు అట్టహాసంగాప్రారంభమయాయి. ఈ సందర్భంగా పండరీపూర్‌కు చెందిన రాజేందర్ మహారాజ్ కీర్తనతోపాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మహారాష్ట్రకు చెందిన వారీకార్ సంప్రదాయ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

డీసీసీబీ ఖాతాదారులకు రూ.2లక్షల ప్రమాద బీమా

- బచ్‌పన్ భరోసా పథకంపై విస్తృత ప్రచారం
- వాల్‌పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ

కౌడిపల్లి, జూన్ 3: నూతనంగా డీసీసీ బ్యాంకులో ఖాతా తీసిన ప్రతీ ఒక్కరికి రూ.2లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని కౌడిపల్లి డీసీసీ బ్యాంకు మేనేజర్ ప్రజిమ్మరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని డీసీసీ బ్యాంకులో బచ్‌పన్ భరోసా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ విలేకరులతో మాట్లడుతూ డీసీసీ బ్యాంకు సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకుగానూ పోస్టర్లు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పదేళ్లు నిండిన బాల, బాలికల పేరిట సహకార బచ్‌పన్ భరోసా డిపాజిట్ చేస్తే 9 సంవత్సరాల్లో రెట్టింపు పొందే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, సీఈవో దుర్గాగౌడ్, బ్యాంకు సిబ్బంది. రైతులు ఉన్నారు.

'బచ్‌పన్ భరోసా'ను సద్వినియోగం చేసుకోవాలి

వెల్దుర్తి, జూన్ 3: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అందించే బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెల్దుర్తి బ్యాంకు మేనేజర్ రవీందర్ కోరారు. సోమవారం వెల్దుర్తిలోని డీసీసీ బ్యాంకులో సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి, బ్యాంకు సిబ్బందితో కలిసి మేనేజర్ రవీందర్ బచ్‌పన్ భరోసా డిపాజిట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెలలో డీసీసీబీలో ఖాతా తెరిస్తే రూ. 2లక్షల ఉచిత బీమా పొందవచ్చన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు డిపాజిట్లపై అత్యధికంగా 8.25శాతం వడ్డీ ఇస్తున్నామన్నారు. డీసీసీబీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో సిద్ధయ్య మెదక్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్‌చందర్ తదితరులు ఉన్నారు.


పుల్కల్‌లో కరపత్రం, పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బ్రాంచి మేనేజర్ శ్రీలత

ఇంటింటికీ డీసీసీబీ

పుల్‌కల్, జూన్ 3: డీసీసీ బ్యాంకు సేవలను మరింత విస్తృతం చేసే లక్ష్యంతో ఇంటింటికీ డీసీసీబీ పథకం కరపత్రాన్ని పుల్కల్ బ్రాంచి మేనేజర్ శ్రీలత సోమవారం ఆవిష్కరించారు. స్థానిక బ్రాంచిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ఖాతాదారుల సమక్షంలో కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకంతో పాటు బ్యాంకు ద్వారా అందించే ఇతర సేవలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. బచ్‌పన్ భరోసా పథకానికి ఈ నెల 30వ తేదీ వరకు చివరి గడువు అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అవుసలి శ్రీనివాసచారి, మాజీ సర్పంచ్ దప్పూరి శ్రవన్‌కుమార్, బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మురళీ, క్యాషియర్ ముఖీం, ప్రశాంత్, మురళీకృష్ణ, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలలకు తెరుచుకున్న ఈఎస్ఐ డిస్పెన్సరీ

తూప్రాన్, జూన్ 3: పట్టణంలోని ఈఎస్ఐ డిస్పెన్సరీకి సంబంధించిన అద్దె చెల్లించకపోవడంతో యజమాని తాళం వేయగా, రెండు నెలల అనంతరం అద్దెచెల్లింపు చేయడంతో ఎట్టకేలకు సోమవారం తెరచుకుంది. మెదక్ జిల్లాలో కార్మికులకు వైద్య సేవలు అందించేందుకు ఈఎస్ఐ డిస్పెన్సరీని శివ్వంపేట మండలం శభాష్‌పల్లికి మంజూరు చేశారు. కార్మికుల సౌకర్యార్థం కొన్నేళ్ల క్రితం తూప్రాన్ మండల కేంద్రానికి మార్చారు. కొంతకాలం తర్వాత తూప్రాన్ పరిధిలోని రావెల్లి పంచాయతీ పరిధి పోతరాజుపల్లికి మార్చారు. దశాబ్ద కాలంగా పోతరాజుపల్లిలో గజ్వేల్‌రోడ్డులో నిర్వహిస్తున్నారు. అద్దెభవనంలో కొనసాగుతున్న ఈఎస్ఐ డిస్పెన్సరీకి ఏడాది కాలంగా అద్దె చెల్లింపు చేయకపోవడంతో ఏప్రిల్ ఒకటిన భవన యజమాని ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం వేశారు. అంతే కాకుండా సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్‌లో ఉన్న మరో డిస్పెన్సరీకి సైతం అక్కడి యజమాని తాళం వేశాడు. ఉమ్మడి జిల్లాలో రెండు డిస్పెన్సరీలకు తాళం పడటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తూప్రాన్ డిస్పెన్సరీ భవన యజమానికి కార్పొరేషన్ నుంచి ఈ నెల ఒకటిన అద్దె చెల్లించారు. దీంతో సోమవారం తూప్రాన్ పట్టణంలో నిర్వహిస్తున్న ఈఎస్ఐ డిస్పెన్సరీ తెరచుకోవడంతో రోగులు ఊరట చెందారు. అయితే జహీరాబాద్ ఈఎస్ఐ డిస్పెన్సరీకి పూర్తిస్థాయిలో అద్దె చెల్లించకపోవడంతో ఇంకా తెరచుకోలేదు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- రాష్ట్రావతరణ ఉత్సవాల ముగింపులో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో తొలిదశ ఉద్యమకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, జూన్ 3: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ ముగింపులో భాగంగా సోమవారం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కందిలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కూడా గడవకముందుకే కరెంటు కోతలతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుందన్నారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కోరుతున్నారన్నారు. అనంతరం చింతా ప్రభాకర్ తొలిదశ ఉద్యమకారులను సన్మానించారు. చివరగా మాజీమంత్రి హరీశ్‌రావు జన్మదిన కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చెర్ పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, మహిపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఏర్పాటులో అమరుల త్యాగం మరువలేనిది

- మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి


అమరవీరుల స్తూపం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పద్మారెడ్డి, సునితారెడ్డి తదితరులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 3: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అమరుల త్యాగం మరువలేనిదని బీఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా సోమవారం స్థానిక జిల్లా కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి, అమరవీరుల స్తూపం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణను నెంబర్‌వన్‌గా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీర్చిదిద్దారన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేకపోయిందని విమర్శించారు. అనంతరం నర్సాపూర్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ సర్కార్ తుంగలో తొక్కుతుందని మండిపడ్డారు. అనంతరం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'దగాపడ్డ తెలంగాణ' ప్రదర్శనను ఎల్‌ఈడీ స్క్రీన్‌పై నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. చివరగా మాజీ మంత్రి హరీశ్‌రావు బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమాల్లో జడ్పీచైర్మన్ హేమలతశేఖర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, జడ్పీ వైస్‌చైర్మన్ లావణ్యారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బట్టి జగపతి, రాష్ట్ర నాయకులు దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆరెళ్ల మల్లిఖార్జున్‌గౌడ్, ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నూతన చిహ్నానికి ధర్మసమాజ్ పార్టీ సూచనలు

సంగారెడ్డి రూరల్, జూన్ 2 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాన్ని మార్పు చేసేందుకు సంకల్పించినందున కొత్త చిహ్నంపై ధర్మ సమాజ్ పార్టీ పలు సూచనలు చేసింది. సోమవారం కలెక్టర్‌కు తమ ప్రతిపాదనను జిల్లా కమిటీ అందజేసింది. తాము ప్రతిపాదిస్తున్న ఈ చిహ్నంలో ఉస్మానియా యూనివర్సిటీ, డా. బీఆర్. అంబేద్కర్, సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్, సమ్మక్క సారలక్క చిత్రాలను పొందుపరచాలన్నారు. ప్రతిపాదనలు అందజేసిన వారిలో ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నెకల లక్ష్మణ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్, యాదగిరి, కోశాధికారి కుమార్, నాయకులు ధన్‌రాజ్, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మాజీమంత్రి హరీశ్‌రావు జన్మదిన వేడుకలు


నర్సాపూర్ ఎమ్మెల్యే స్వగృహంలో కేక్ కట్‌చేస్తున్న సునితారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు.

నర్సాపూర్, మే 3: మాజీమంత్రి హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా నర్సాపూర్‌లో స్థానిక ఎమ్మెల్యే సునితారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ నిరంతరం ప్రజాసమస్యల కోసం పాటుపడే హరీశ్‌రావు నిండునూరేళ్ల ఆయుఆరోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ నయిమొద్దిన్, నాయకులు సత్యంగౌడ్, శేఖర్, కౌన్సిలర్ రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

- **తూప్రాన్:** తూప్రాన్ మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో స్థానికి సుభాష్ చంద్రబోసు విగ్రహం వద్ద హరీశ్‌రావు జన్మదిన కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మామిడి వెంకటేష్, బీఆర్ఎస పార్టీ మండల అధ్యక్షుడు బొలంపల్లి బాబుల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.
- **శివ్వంపేట:** మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా మండల నాయకులు ఎంపీపీ హరికృష్ణ, పార్టీ అధ్యక్షుడు రమణాగౌడ్, నరేందర్ ఆంజనేయులు తదితరులు సోమవారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
- **టేక్మాల్:** మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భక్తుల వీరప్ప ఆధ్వర్యంలో హరీశ్‌రావు జన్మదినం కేక్‌ను కట్ చేసి పరస్పరం తినిపించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వప్న, నాయకులు ఉన్నారు.
- **సంగారెడ్డి అర్బన్:** హరీశ్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ చేతుల మీదుగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు.
- **జహీరాబాద్:** పట్టణంలోని హరీశ్‌రావు అభిమానులు, నాయకులు జన్మదినం సందర్భంగా కేకును కట్ చేసి పంచిపెట్టారు. స్థానిక ప్రభుత్వఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అల్లాడి నర్సింహులు, వెంకటేశం, నామకిరణ్, యాకూబ్, సుభాష్, మోహియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.
- **నారాయణఖేడ్:** మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖేడ్ నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు గృహానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండల అధ్యక్షుడు పరమేశ్వర్, జడ్పీటీసీ లక్ష్మీబాయి, నాయకులు పాల్గొన్నారు.
- **జిన్నారం:** హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు బొల్లారం డిజైర్ సొసైటీలోని హెచ్ఐవీ బాధిత చిన్నారులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.
- **మునిపల్లి:** మునిపల్లి జడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్, ఎంపీపీ శైలజ శివశంకర్, బీఆర్ఎస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసంలో కలిసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హరీశ్‌రావును కలిసిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్, మండల నాయకుడు పరశురాంగౌడ్ తదితరులు ఉన్నారు.

అందెశ్రీని కలిసిన తూప్రాన్ నాయకులు


కవి అందెశ్రీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

తూప్రాన్, జూన్ 3: తూప్రాన్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ కవి అందెశ్రీని సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణ పాటను అందెశ్రీ రాసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అందెశ్రీని కాంగ్రెస్‌నాయకులు అభినందించారు. కలిసినవారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, గజ్వేల్ మాజీ చైర్మన్ గాడిపల్లి బాస్కర్, పార్టీనాయకులు పల్లెర్ల రవీందర్‌గుప్తా, మామిండ్ల కృష్ణ, శ్రీశైలంగౌడ్, రాజు, రఘుపతి, విశ్వరాజ్‌లు ఉన్నారు.

తెల్లాపూర్‌లో దశాబ్ది వేడుకలు


జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న గద్దర్ కూతురు వెన్నల

రామచంద్రాపురం, జూన్ 3 తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఆదివారం రాత్రి తెల్లాపూర్‌లోని గద్దర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. గద్దర్ గళం అధ్యక్షుడు కొల్లూరి సత్తయ్య, కౌన్సిలర్ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గద్దర్ కుమార్తె వెన్నల ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. బహుజన సామాజిక తెలంగాణ ఏర్పాటయ్యేవరకు పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయని వక్తలు పేర్కొన్నారు. వర్షంలో కూడ ప్రజలు కార్యక్రమాన్ని వీక్షించారు.

బాగారెడ్డి సేవలు చిరస్మరణీయం


కార్యక్రమంలో మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్

జహీరాబాద్, జూన్ 3: జహీరాబాద్ ప్రాంతానికి దివంగతనేత బాగారెడ్డి సేవలు చిరస్మరణీయమని జహీరాబాద్ ఎంపీ బీబీపాటీల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్‌లోని సుభాష్‌గంజ్‌లో గల ఆయన నివాసంలో 20వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. జహీరాబాద్ ప్రాంతంలో ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలే నేడు మనకు దర్శనమిస్తాయన్నారు. రాజకీయ భీష్మపితామహుడిగా పేరొందిన ఆయనను అభివర్ణించారు. ఆయన ఆశయసాధన దిశగా నడుచుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఉమ్మడి మెదక్‌జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గిరిజన రిజర్వేషన్లు తగ్గిస్తే ఊరుకోం


సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్

పుల్‌కల్, జూన్ 3: గిరిజనులకు జనాభా ప్రతిపాదికన విద్యా, ఉద్యోగాల్లో అమలవుతున్న 10 శాతం రిజర్వేషన్‌ను తగ్గిస్తే ఊరుకోబోమని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ పేర్కొన్నారు. చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెంలో సోమవారం నిర్వహించిన గిరిజనుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రిజర్వేషన్‌ను విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎవరో ఇద్దరు వ్యక్తులు హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్ నంబర్ డబ్ల్యూపీ నెం.12989/2024పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హైకోర్టులో పూర్తి సమాచారంతో వాదనలు వినిపించాలని డిమాండ్ చేశారు. పది శాతం గిరిజన రిజర్వేషన్ విద్యా ఉద్యోగాల్లో యథాతథంగా కొనసాగేలా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. సమావేశంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు జాదావత్ రవీందర్ కారోబారి, రాములు నాయక్, సంతోష్, మోత్యానాయక్, మెగావత్ సుశీల్‌నాయక్, ప్రకాశ్‌జదావత్, రమావత్ సంతోష్, పాండు, విగ్రేష్‌లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

హత్నూర, జూన్ 3: మండల కేంద్రమైన హత్నూరలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ బాదె జయశ్రీ శివశంకర్‌రావు స్టార్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సంగారెడ్డి వారు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి హత్నూర, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రావు, మాజీ సర్పంచ్ మహంకాళీ నగేష్, మాజీ జడ్పీటీసీ ఆశయ్య, యాదయ్య, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట మండలంలో ఆగని మట్టి అక్రమ రవాణా


ఎలాంటి అనుమతులు లేకుండా తవ్విన మట్టి

నిజాంపేట, జూన్ 3: మండలంలో మట్టి మాఫియా బరితెగించింది. ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టిన పెద్దఎత్తున తరలిస్తున్నారు. తాజాగా సోమవారం నందిగామ సాయి చెరువులో మట్టి తవ్వకాలు జరుపుతున్న వాహనాలను సీజ్ చేసినట్టు ఇరిగేషన్ అధికారి కుశాల్ తెలిపారు. ఉన్నతాధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమవడంతో కిందిస్థాయి సిబ్బందితో కొంతమంది అక్రమార్కులు కుమ్మక్కై యథేచ్ఛగా మట్టిని భారీవాహనాల్లో తరలిస్తున్నట్టు మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని నందిగామ గ్రామ శివారులోని సాయి చెరువు నుంచి కొద్దిరోజులుగా రాత్రిపూట టిప్పర్లతో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో సోమవారం ఇరిగేషన్ అధికారులు వాహనాలను సీజ్ చేసినట్టు తెలిపారు. అనుమతులు లేకుండా చెరువుల్లో, కుంటల్లో మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తూప్రాన్‌లో వ్యక్తి అదృశ్యం


నాగులు(ఫైల్)

తూప్రాన్, జూన్ 3: తూప్రాన్ పట్టణంలో నివాసముండే వ్యక్తి అదృశ్యమయ్యాడు. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ మౌలాలికి చెందిన నాగులు(42), శిరీషా దంపతులు ఏడాది కాలంగా తూప్రాన్‌లో నివాసముంటున్నారు. కూచారం వద్దగల కంపెనీలో పనిచేస్తున్న నాగులు గత నెల 28న బాలాజీనగర్‌లో ఉన్న ఇంటికి వెళ్లివస్తానంటూ ఇంట్లోంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోయింది. సోమవారం నాగులు భార్య శిరీష పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాయిబాబా ఆలయంలో చోరీకి యత్నం

మాసాయిపేట, జూన్ 3: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో సోమవారం తెల్లవారుజామున చోరీయత్నం జరిగింది. స్థానికులు, ఆలయవర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దొంగలు ఆలయ ప్రధాన ద్వారాన్ని పగలగొట్టారు. అనంతరం ఆలయంలో గల ప్రధాన హుండీని ఆ ప్రక్కనే గల మరో బీరువాను ధ్వంసం చేసేందుకు యత్నించారు. సుమారు రెండు గంటలపాటు దొంగతనానికి యత్నించిన దుండగులు చుట్టుపక్కల వారు మేల్కొనడంతో పారిపోయారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఈ సంఘటనలో ఆలయ ప్రధాన ద్వారం తలుపు కొంతమేర పగిలిపోగా తాళం విరిగిపోయింది. ఈ సంఘటనపై చేగుంట పోలీసులకు గ్రామ తాజా మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో భక్త బృందం సభ్యులు ఆంజనేయులు, గోపాల్, నాగరాజు, తదితరులు ఫిర్యాదుచేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

శివ్వంపేట, జూన్ 3: విద్యుదాఘాతంతో బర్రె మృతి చెందిన సంఘటన సోమవారం కొంతంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని కొంతాన్‌పల్లి గ్రామంలో ఆకుల నరేశ్‌కు చెందిన పాడి గేదె గ్రామ శివారులోని పొలంలో మేత మేస్తుండగా బోరు స్టార్టర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.

నారాయణఖేడ్‌లో మేక..

నారాయణఖేడ్, జూన్ 3: నారాయణఖేడ్ మండలంలోని హుక్రాన.జి గ్రామంలో విద్యుదాఘాతంతో మేక మృతి చెందింది. హుక్రాన.జి గ్రామానికి చెందిన కురుమ మల్గొండకు చెందిన మేక మేత మేస్తూ కంచెలేని సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. ఎర్తింగ్ వైర్‌కు విద్యుత్ సరఫరా జరుగడంతో మేక అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ రూ.10 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి

చిన్నశంకరంపేట, జూన్ 2: ముప్పై నెలలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి పేర్కొన్నారు. సోమవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులతో కలిసి బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ చిన్నారులకు 30 నెలలు నిండగానే తల్లిదండ్రులు పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలకు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. చిన్నారుల భవిష్యత్తుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నాగరాణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలి

చిన్నశంకరంపేట, జూన్ 2: పాఠశాలలు పునఃప్రారంభంలోపు పలు పాఠశాలలకు స్కావెంజర్లను నియమించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సోమవారం వారు చిన్నశంకరంపేటలో విలేకరులతో మాట్లాడుతూ.. పాఠశాలల్లో స్కావెంజర్లు లేకపోవడంతో పరిశుభ్రత దెబ్బతింటుందన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ అసోసియేట్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, వెల్దుర్తి మండల ప్రధాన కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.


మూతబడిన బడులు తెరిపించాలి

సంగారెడ్డి అర్బన్, జూన్ 3: జిల్లాలో మూతబడిన బడులు తెరిపించాలని టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఏవో పరమేశంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్ మాట్లాడుతూ బడులు మూసివేయడంతో పేద, బడుగు బలహీన వర్గాల పిల్లలు బడికి దూరమై విద్యను పొందే హక్కు కోల్పోతున్నారన్నారు. ప్రాథమికోన్నత విద్యను పూర్తయ్యే వరకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్యయాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యను అంగడి సరుకుగా మార్చేశారు: ఏఐఎస్ఎఫ్

జహీరాబాద్, జూన్ 3: మార్కెట్లో విద్యను కార్పొరేట్ విద్యాసంస్థలు అంగడిసరుకులా మార్చేశాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టలక్ష్మణ్ విమర్శించారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలో భరత్‌నగర్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు విద్యను అందకుండ తయారుచేసిన కార్పొరేట్ ఆగడాలను అరికట్టడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. విద్యను వ్యాపారంగా మార్చేసి రకరకాల ఫీజుల పేరుతో దోపిడీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసి, ఫీజుల నియంత్రణను పకడ్బందీగా అమలయ్యేలా ప్రభుత్వం చొరవచూపాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకుడు సయ్యద్‌జలాలొద్దీన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు దృష్టి పెట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మనూరు, జూన్ 3: గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వర్షాకాలం నీరు కలుషితం అయిప్రజలు అనారోగ్యం పాలవుతారన్నారు. విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీపీ కొంగిరి జయశ్రీమోహన్‌రెడ్డి, ఎంపీడీవో అలివేలుమంగ, వివిధ శాఖల అధికారులు, అశోక్‌రెడ్డి, వంశీక్రిష్ణ, నర్సింగ్‌చౌహాన్, అధికారులు పాల్గొన్నారు.

కోరం లేక ఎంపీపీ సర్వసభ్య సమావేశం వాయిదా

సోమవారం జరగాల్సిన మనూరు ఎంపీపీ సర్వసభ్య సమావేశానికి కోరం సభ్యులు లేక పోవడంతో సమావేశం వాయిదా పడింది. కేవలం ఇద్దరు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు.